క్లుప్తంగా

జైనుల ర్యాలీ..



డోర్నకల్: స్థానిక మెయిన్ రోడ్డులోని ఆదినాథ్ భగవాన్ మందిర్‌లో బుధవారం మందిర ప్రథమ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో జండాను ఆవిష్కరించి ఆదినాథ్ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదినాథ్ భగవాన్ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

టీపీఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకన్న

తొర్రూరు: టీపీఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అర్వపల్లి వెంకన్న నియమితులయ్యాడు. మహబూబాబాద్‌లో జరిగిన తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ యూనియన్ మహాసభల్లో నియామకాన్ని రాష్ట్ర నాయకులు ప్రకటించారు.

7న 'లక్ష డప్పులు, వెయ్యి గొంతుల' మహాసభ

కొత్తగూడ: ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ పట్టణంలో ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతుల మహాసభను విజయవంతం చేయాలని సంఘం జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో మంద కృష్ణమాదిగ తలపెట్టిన కార్యక్రమానికి మండలం నుంచి భారీగా తరలి రావాలని కోరారు. ఈసమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాకయ్య, అనిల్, ప్రేమ్‌సాగర్, ప్రభాకర్, విక్రమ్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

తొర్రూరు: 2025–26 విద్యాసంవత్సరానికి గాను పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పసునూరి వనజ తెలిపారు. ఐదో తరగతిలో 80సీట్లకు గాను మైనార్టీ విద్యార్థులకు 60, నాన్ మైనార్టీలకు 20సీట్లు కేటాయిస్తామన్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులకు గాను 80సీట్లకు దరఖాస్తులు కోరుతున్నామని, మైనార్టీలకు 60, నాన్ మైనార్టీలకు 20సీట్లు కేటాయిస్తామన్నారు. 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు గాను మైనార్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీలోగా http://tmreirtelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 79950 57928 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



మహబూబాబాద్ అర్బన్: గత ఏడాది డిసెంబర్‌లో నెలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 12మంది విద్యార్థులు ప్రతిభ చాటి నగదు బహుమతులను గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ భార్గవిరెడ్డి బుధవారం తెలిపారు.

ఓబీసీ వైస్ చైర్మన్‌గా దుర్గేశ్



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణ ఓబీసీ వైస్ చైర్మన్‌గా అల్లి దుర్గేశ్ నియామకమయ్యారని కాంగ్రెస్ పార్టీ అనుబంధ పట్టణ ఓబీసీ సెల్ చైర్మన్ లింగాల వీరభద్రం గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ చేతుల మీదుగా బుధవారం నియామక పత్రం అందుకున్నాడు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ చైర్మన్ మేకల వీరన్నయాదవ్, వెంకట్ నాయక్, రామచంద్రు పాల్గొన్నారు.

బడిలో చేర్పించాలి

కురవి: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీ వెంకన్న తల్లిదండ్రులను కోరాడు. బుధవారం మండల కేంద్రం శివారు లింగ్యా తండా గ్రామంలో ఇంటింటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించేందుకు సర్వే చేశాడు.

దాడి విచారకరం

డోర్నకల్: విజయనగరం జిల్లా బీటీ అగ్రహారం సిస్ట్ బాపిస్ట్ చర్చి ప్రాంతంలో క్రైస్తవులపై జరిగిన దాడి విచారకరమని తెలంగాణ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బిషప్ మల్సూర్‌నాయక్ బుధవారం తెలిపారు. ఏసుపాదం, డేవిడ్‌రాజ్, పాతిపాల్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా..

ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాలు

- వినియోగంలోకి తీసుకురావాలని నిరుద్యోగుల డిమాండ్
- మరమ్మతులు చేస్తే నెలకు రూ.30వేల ఆదాయం



ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలకు అడ్డంగా నిర్మించిన ఆర్అండ్‌బీ ప్రహరీ

మహబూబాబాద్ అర్బన్: నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉపాధి కల్పించడానికి జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జ్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1986లో శంకుస్థాపన చేసి 1987లో అప్పటి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఎం.నర్సింహులు ప్రారంభించారు. ఆ సముదాయంలో సుమారు ఎనిమిది దుకాణాలను నిర్మించారు. ఎస్సీ నిరుద్యోగ నిరుపేదల కుటుంబాలు, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అందులో అద్దెకు ఉండి జీవనం కొనసాగించే వారు. మధ్య గేటు తీసివేసి అండర్‌బ్రిడ్జి నిర్మించడంతో పూర్తిగా దుకాణాల సముదాయాల్లో వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారస్తులకు వ్యాపారం లేక ఆర్థికంగా నష్టపోవడంతో అందులో ఉన్న వారు ఖాళీ చేసి ఇతర స్థలాల్లోకి వెళ్లారు. దీంతో 2010నుంచి దుకాణ సముదాయాలు మొత్తం ఖాళీ అయ్యాయి. అప్పటి నుంచి నిరుపయోగంగా మారాయి. దుకాణ సముదాయ ప్రాంతంలో మందుబాబులకు, పోకిరీలకు అడ్డగా మారి అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కొత్త మంది దుకాణ సముదాయంలో అద్దెకు ఉంటున్నారు. వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దె పెండింగ్‌లో ఉంది. దుకాణ సముదాయలు మొత్తం 8 షెటర్లు ఉన్నాయి. మర్మమతులు చేస్తే అద్దెకు ఇస్తే నెలకు సుమారు రూ.30వేలు ఆర్థికంగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పలువురు వ్యాపారులు తెలుపుతున్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ సముదాయ దుకాణాలను మరమ్మతులు పూర్తి స్థాయిలో నిర్వహించి ఎస్సీ నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

పునఃప్రారంభించాలి



మానుకోట నడిబొడ్డులో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయం ప్రస్తుతం చాలా ఏళ్ల వరకు నిరుపయోగంలో ఉంది. దానికి మరమ్మతులు చేయిస్తే ఎస్సీ నిరుద్యోగుల యువతలకు ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికైన ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి.

– ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు

విద్యార్థులకు ఇంగ్లిష్‌పై స్కిల్స్ పెంచాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి



మహబూబాబాద్ అర్బన్: ప్రశంస పత్రం అందజేస్తున్న డీఈఓ

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు ఇంగ్లిష్‌పై కమ్యూనికేషన్ స్కిల్స్ ఉపాధ్యాయులు పెంచాలని జిల్లా డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల హోలి ఏంజిల్స్ స్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి ఒలింపియాడ్ ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి బయగాని రామ్మోహన్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 317 జీఓ స్పౌజ్‌పై బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు రిలీవ్ ఆర్డర్ కాపీలను డీఈఓ, ఏడీ రాజేశ్వర్ అందజేశారు. జిల్లా నుంచి 59 మంది ఇతర జిల్లాలకు వెళ్లనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, వివిధ గురుకులాల పాఠశాలల్లో ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు డీఈఓ గ్రూప్‌లో షేర్ చేయాలన్నారు.

డోర్నకల్: డోర్నకల్ మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.షార్వారీ రాష్ట్రస్థాయి ఎలాక్యూషన్ పోటీలకు ఎంపికైంది. మహబూబాబాద్ ఏకశిల హోలీ ఏంజెల్స్ పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఎలాక్యూషన్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంపికైంది. గైడ్ టీచర్ దీప్తితో కలిసి డీఈఓ రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్న షార్వారీని ప్రిన్సిపాల్ కృష్ణభాను, ఉపాధ్యాయులు అభినందించారు.

నెల్లికుదురు: జిల్లా కేంద్రంలోని ఏకశిల ఎంజిల్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఒలింపియాడ్ పరీక్ష, వక్తృత్వ పోటీల్లో మోడల్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి ఈశ్వర్ చంద్ర ప్రథమ బహుమతి కై వసం చేసుకుని రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే మురళీనాయక్



కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని గాజులగట్టులో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అధికారులు ప్రజల దరఖాస్తులను పరిశీలించి, నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని, లబ్ధిదారుడు ఎవరైనా సరే, అర్హుడైతే కేటాయించాలన్నారు. అనంతరం పల్లె దవాఖాన చుట్టూ కాంపౌండు వాల్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. అనంతరం వెంగంపేటలో నూతన జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, తహసీల్దార్ స్వేత, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న, నాయకులు ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, బొల్లికొండ మధుగౌడ్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న మాలతి

గూడూరు: గొర్రెలు, మేకల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని కేవీకే సమన్వయ కర్త డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. మండల కేంద్ర సమీప వడ్డెరగూడెం రైతువేదికలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ పరిధిలోని జిల్లా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక కింద గొర్రెల, మేకల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పుట్టిన పిల్లల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి పోషణపై వివరించారు. పెంపకందారులు ఎక్కువగా గొర్రెలు, మేకల సంరక్షణ కోసం ముఖ్యంగా సమీప పశువైద్యశాల వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు భాను, సాయికిరణ్, రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మహబూబాబాద్ రూరల్: గుడుంబా నిర్మూలన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, తండాల్లో బుధవారం ఎక్సైజ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మండలంలోని అనంతారం, సుందరయ్య నగర్, సీత్లా తండా, గార్ల మండల కేంద్రం, కురవి మండలంలోని పెద్దతండా, తాట్యతండా గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు చేపట్టారు. 7 కేసులు నమోదు చేసి, 8మందిని అదుపులోకి తీసుకుని, 20కిలోల బెల్లం, 10కిలోల పటిక, ఒక ద్విచక్రవాహనం, 41లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. బోడ కోబాల్ బోడ లక్ష్మి, కొర్ర అనిత, భూక్య సునీత, మూడ్ కవిత, బాదావత్ భద్రు, పిట్టల రాధా, ఎడ్ల ఎల్లాబాయిపై కేసు నమోదు చేసి, సంబంధిత తహసీల్దార్ల ఎదుట ముందు బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో సీఐలు నాగేశ్వర్ రావు, ఎక్సైజ్ ఎస్సైలు మౌనిక, కిరీటి, సిబ్బంది పాల్గొన్నారు.

600 కిలోల నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రైల్వే స్టేషన్ కూడలి వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 600 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక, 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు వాడిన ఆటోను సీజ్ చేసి గూడూరు మండలానికి చెందిన గుగులోతు నిజ్జుపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ నాగయ్య, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెహ్రూసెంటర్: రైతులకు వ్యతిరేకంగా మోదీ సర్కార్ తీసుకువచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని ఎస్‌కేఎం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతుల వినాశనానికి చట్టాలను తీసుకువచ్చి వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 26వ తేదీన రైతులకు మద్దతుగా, చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో ట్రాక్టర్స్ ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జు దేవేందర్, బండారి ఐలన్న, నల్లపు సుధాకర్, మేక వీరన్న, అల్వాల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో వసతులు మెరుగుపర్చాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

డోర్నకల్: ప్రభుత్వ విద్యా సంస్థలు, గురుకులాల్లో వసతులు మెరుగుపర్చాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. స్థానిక మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం ఎమ్మెల్సీ పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రిన్సిపాల్ రిజ్వానా ఎమ్మెల్సీకి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 655 గురుకులాలు అద్దె భవనాలు, అరకొర వసతుల్లో కొనసాగుతున్నాయన్నారు. రూ.3,500కోట్ల మేర యుకుబేర్ బకాయి నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి పాఠశాల స్థల దాత కట్కూరి నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే తన ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి పాఠశాల ప్రహరీకి నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనిర్మల, నాయకులు నవీన్, హరిసింగ్, మంగీలాల్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో అధికారుల నిలదీత

ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులను ఎంపిక చేశారంటూ బుధవారం గ్రామసభల్లో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అనర్హులను ఎలా ఎంపిక చేశారంటూ రోడ్డుపై బైటాయించి ఆందోళన చేశారు. అర్హులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

– సాక్షి నెట్‌వర్క్



డోర్నకల్: చిలుకోడులో గ్రామస్తుల ఆందోళన



కేసముద్రం: మహమూద్‌పట్నంలో కంటతడి పెట్టుకుంటున్న దివ్యాంగురాలు



గార్ల: సీతంపేట గ్రామసభలో అధికారులతో వాగ్వాదం



చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో అధికారులు లేకపోవడంతో కుర్చీలకు దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు



మహబూబాబాద్: 23వ వార్డులో..



కురవి: అయ్యగారిపల్లి సభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తుడు



కొత్తగూడ గ్రామ సభలో కార్యదర్శిని నిలదీస్తున్న మహిళలు

సంక్షిప్త సమాచారం

ఆలయంలో చోరీ

డోర్నకల్: మండలంలోని గుర్రాలకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని టీకులతండా అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి అగంతకులు గుడి తాళం పగలగొట్టి ఆలయంలోని వెండి కడియం, గధను చోరీ చేశారు. చోరీ చేసిన ఆభరణాల విలువ రూ.12వేలు ఉంటుందని, ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తండావాసులు బుధవారం తెలిపారు.

విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్: నూరేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ ప్రజాపోరాటాలు నిర్వహించిందని సీపీఐ మండల కార్యదర్శి తండా సందీప్ అన్నారు. మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈనెల 25న జిల్లా కేంద్రంలో సీపీఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గార్ల: ఈనెల 25న మహబూబాబాద్ లో నిర్వహించే పార్టీ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి జంపాల వెంకన్న బుధవారం పిలుపునిచ్చారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లికుదురు: ఈనెల 25 నుంచి 28వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు అసంఘటిత కార్మికులకు పిలుపు నిచ్చారు. బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణేశ్, రాము, భిక్షం, సాగర్, శ్రావణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ సభ్యుడిగా లక్ష్మణ్

డోర్నకల్: తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా డోర్నకల్‌కు చెందిన వీరదాసు లక్ష్మణ్ ఎన్నికయ్యాడు. ఇటీవల మహబూబాబాద్‌లో జరిగిన యూనియన్ రాష్ట్ర మహాసభలో ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురవి: సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ సోని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో బాలికలు–20, బాలురు–30 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 16వ తేదీ లోపు టీఎస్ఈఎంఎస్.తెలంగాణ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలో 27వ వార్డులో రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం కౌన్సిలర్ మహ్మద్ ఫరీద్ శంకుస్థాపన చేశాడు.

ప్రముఖ న్యాయవాది మృతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది మారంరాజు కృష్ణకుమార్ గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు బుధవారం కృష్ణకుమార్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, కొండపల్లి కేశవరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

తొర్రూరు: డీటీఎఫ్ మండల నూతన కమిటీని బుధవారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులిపాటి తిరుమలేష్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెర కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం. రవీందర్, కె.స్వప్న, కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల, కుమార్, కౌన్సిలర్‌గా దర్గయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కుమారస్వామి నియమితులయ్యారు.

విలీనసభను జయప్రదం చేయండి

బయ్యారం: ఈనెల 24న మంచిర్యాలలో నిర్వహించనున్న పీఓడబ్ల్యూ రెండు సంస్థల విలీనసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పద్మ, జిల్లా నాయకురాలు సోమక్క పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట్రాంపురంలో బుధవారం విలీనసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాయమ్మ, లక్ష్మి, పద్మ, విజయ, రత్న, లత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని జగ్జీవన్ రావు కాలనీకి చెందిన కాంపెల్లి వెంకటేష్ తన కుమారుడు వరుణ్ సందేశ్‌ను బైక్‌పై పాఠశాలకు తీసుకెళ్తున్నాడు. ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోవరుణ్ సందేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

దాబా పైనుంచి పడి ఒకరికి..

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి లక్ష్మణ్ బుధవారం రాత్రి దాబా పైనుంచి ప్రమాదవ శాత్తు జారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మహబూబాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మంకు తరలించినట్లు తెలుస్తుంది.

విద్యలో రాణించాలి

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా వారి భవిష్యత్ ఉజ్వలంగా తయారవుతుందని రెడ్యాల ఏహెచ్ఎస్ ఇన్‌చార్జ్ హెచ్ఎం బి.వెంకన్న అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్ ధరావత్ మోహన్‌నాయక్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి వైద్యులను నియమించాలి



గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని కోరుతూ బుధవారం గార్లకు వచ్చిన కేంద్ర వైద్య మానిటరింగ్ బృందానికి సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. సకల సౌకర్యాలు ఉన్న ఈ ఆస్పత్రిలో వైద్యుల లేకపోవడం వలన మండల ప్రజలకు సక్రమంగా వైద్యసేవలు అందకపోవడంతో, ఖమ్మం, పట్టణాలకు వెళ్లి నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అలువాల సత్యవతి, అంబటి వీరస్వామి, కుంట రామకృష్ణ, సుజాత, పద్మావతి, ఉమ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.